# శారదలేఖ

శ్రీమతి కనుపర్తి వరలక్ష్మమ్మగారు

సౌభాగ్యవతి కల్పలతకు :

నెచ్చెలీ! నీవు వ్రాసిన లేఖ యందినది. అందు యావద్భారతదేశ వ్యాప్తమైన స్వరాజ్యోద్యమ మొకటి సాగించుట భారతీయులెల్లరి ముఖ్యకర్తవ్యమైయుండ 'పులి మీద పుట్ర' యనినటుల యీ ఆంధ్రరాష్ట్రోద్యమ మేమి? స్వరాజ్యము సిద్ధించినపుడు స్వరాష్ట్రములు మాత్రము సిద్ధింపవా? వానికి ప్రత్యేక అలజడియేల? తెలుగుపత్రిక లన్నియు నీరాష్ట్రగొడవతో నిండిపోవుచున్నవే? అని ప్రత్యేకాంధ్రరాష్ట్రమును గుఱించి నీవు వ్రాసిన వాక్యములు నాకాశ్చర్య విషాదముల నొక్కమాఱుగా గలుగజేసినవి. అచ్చమగు తెలుగు సీమను జనియించి తెలుగు మాతృభాషగాగల తెలుగుబిడ్డవగు నీవు తెలుగుదేశము ప్రత్యేకరాష్ట్రముగా యేర్పడుటవలని ప్రయోజన మిసుమంతయైన నెఱుంగక నిటుల ప్రశ్నించుటనుబట్టియే తెలుగురాష్ట్ర మెంతశీఘ్రముగా నేర్పడవలసినదియు విదితమగుచున్నది.

మన ఆంధ్రులచరిత్ర మతిపురాతనమైనది. ఐతరేయ బ్రాహ్మణములందే ఆంధ్రుల ప్రశంసగలదు. క్రీస్తుకు పూర్వము 300 సంవత్సరముల క్రిందటనే మనఆంధ్రులు మహాసామ్రాజ్యమును నిర్మించి ధాన్యకటకమును రాజధానిగ జేసికొని సార్వభౌములై సామ్రాజ్యపాలన మొనర్చిరి. తమపేర శాలివాహనశకము నేర్పరచి శకపురుషులను ఖ్యాతిగాంచిరి. విద్యాపీఠముల నెలకొల్పిరి. మహాశిల్పముల నిర్మించిరి. విదేశవాణిజ్యముల్ను సాగించిరి. మతముల వ్యాప్తి నొందించిరి. కవుల పోషించిరి. గాయకుల నాదరించిరి. పండితుల సమ్మానించిరి. ఆంధ్రనారీమణులును విద్యావతులై రాజ్యపాల నాదివిషయములలో పురుషులకు తీసిపోక యశోవిశాలలైరి. ఇట్టి విఖ్యాతచరిత్రము గలది మన తెలుంగుసీమ. అట్టి మన తెలుగు దేశస్థితి నేడెటులున్నది? చూడుము. మనకు ప్రత్యేకరాష్ట్రము లేదు. చెన్నరాజధానిలో తమిళప్రాబల్యమునకు దోసిలొగ్గి జీవించుచున్నాము.

తెలుగుభూమి ఓఢ్రరాష్ట్రములో కొంత నిజాంరాజ్యములో కొంత మైసూరు సంస్థానములో కొంత కలిపివేయబడియున్నను, నిప్పటికిని బరంపురము మొదలుకొని బళ్లారి వరకుగల తెలుగుసీమ యంతయు నేకఖండముగ నేయున్నది. ఆంధ్రదేశము నిస్సారమగు ప్రదేశముగాదు. దేశమును సస్యభరితముగా జేయగల కృష్ణ, గోదావరి, తుంగభద్ర, పినాకిని, నాగావళి వంశధార మున్నగు నదులును, వాణిజ్యోపయుక్తమగు సముద్రతీరమును, బంగారము నుత్పత్తిజేయగల ఖనిజములును, మఱియు సమస్తపదార్థముల నొసగగల నున్నతములగు కొండలు, సాంద్రములగు

నరణ్యములును, దివ్యములగు క్షేత్రములును గల చక్కని దేశము. ఆంధ్రులబుద్ధి వైభవమును నల్పముకాదు. కాని చెన్న రాష్ట్రములోబడి యుండుటచే ఆంధ్రుల ప్రతిభ యేవిధమునను వికసించుట కవకాశము కలుగకున్నది.

ఆంధ్రదేశము చిన్నరాజ్యముగాదు. స్వయంపోషక సామర్థ్యము లేనిదిగాదు. 67,491 మైళ్ల విస్తీర్ణమును, 1,71,04,997 జనసంఖ్యయు 7,43,90,018 రూప్యముల రాష్ట్రాదాయమునుగల దేశము. మదరాసు రాష్ట్రములోనించుమించు సగమాదాయము ఆంధ్రదేశమువల్ల చేకూర్పబడుచున్నదనుచో ఆంధ్రదేశమెంత భాగ్యవంతమైనదియు విదితమగును. ఇప్పటి బీహారు, మధ్యపరగణాలు, అస్సాముమున్నగు రాష్ట్రములకంటెను, మొన్నమొన్న యేర్పడిన ఒరిస్సా, సింధు, రాష్ట్రములకంటెను ఆంధ్రరాష్ట్రము పెద్దది. అయినను ఆంధ్రరాష్ట్ర మేర్పడలేదు. మన ఆంధ్రులకు ప్రత్యేకాంధ్ర రాష్ట్రము కావలయుననెడి తలంపు నిన్న నేడు కల్గినదికాదు. 1913 సంవత్సరములో బాపట్లయందు ప్రథమాంధ్రమహాసభ జరిగినప్పటినుండియు ఆంధ్రులప్రత్యేక రాష్ట్రాభిలాష తీర్మానరూపమున వెల్లడింపబడుచునే యున్నది. అయినను ఆంధ్రుల సంకల్పమీ నాటికిని ఫలింపకుండుట విచారకరమగు విషయమేగాక లజ్జాకరమనిగూడ చెప్పుటకు సందియము లేదు. ఆలస్యమున నమృతము విషమగునను సామ్యము కల్లగాదు. ఇరువదేండ్ల దీర్ఘకాలమగుటచే అమృతతుల్యమగు రాష్ట్రోద్యమము కొంత విషరూపము వహించనే వహించినది. ఏకార్యమైనను నెప్పటిమేలప్పుడని త్వరితముగ నెరవేర్చుట యుక్తముగాని యెప్పుడో చేయుదములెమ్మని గొడ్డలి నానవైచిన నిటులేయగును.

మనదేశమున స్వరాజ్యోద్యమము తల సూపనినాడు మన ఆంధ్రుల కాంధ్రోద్యమ మొకటే ప్రధాన జాతీయోద్యమముగనుండెను. అప్పటికి పశ్చిమాంధ్రమండలములు 'రాయలసీమ' కాలేదు. ఆంధ్రులు పదిరెండు జిల్లాలవారు నే పొరపొచ్చెములు లేక నేకీభావముతో ప్రత్యేకరాష్ట్రము కొఱకై తీవ్రకృషి సల్పుచుండిరి. ఆంధ్ర రాష్ట్రము కనుచూపుమేరలోనున్నటు లగుపించెను. ఆ లీలాస్వరూపము నరసి అదిగో వచ్చె! నిదిగో వచ్చె !నని తెలుగు లువ్విళ్లూరుచు సుఖస్వప్నములు గాంచుచుండిరి. ఇంతలో మాంటుఫర్డు సంస్కరణములు అమలులోనికి వచ్చెను. చెన్నరాజధానిలో తెలుగుల సాచివ్యమేర్పడెను. ఆంధ్రుల ఆధిపత్య మన్నిట స్థాపితమగుచున్నటుల గానిపించెను. ఇక ఆంధ్రరాష్ట్రము సిద్ధించుట యొంతమాత్రపు పనియని యందఱకనిపించెను. ఈ ఆనందమయసమయములో మునుముందు 'ఆంధ్రవిశ్వవిద్యాలయ'మను పేరు ఆంధ్రుల చెవిసోకెను. ఈ సువార్త విని తెలుగులు సంతోషతన్మయులైరి. ఈ విద్యాపీఠమే రాష్ట్రపీఠ మెక్కించుటకు దివ్యసోపానమని మురిసిపోయిరి. ఆంధ్రవిశ్వ

విద్యాలయము మూడు భాగములుగ విభజింపబడెను. తూర్పున విశాఖపట్నమున నొకటి, పడమరను అనంతపురమున నొకటి కళాశాల కేంద్రములుపెట్టి మధ్య కృష్ణా జిల్లా విజయవాటికయందు విశ్వవిద్యాలయ కార్యస్థానము పెట్టుటకు నిర్ణయింపబడెను.

ఇది యొకవిధముగ సముచితముగనుండుటచే నెవరును దీని నాక్షేపింపలేదు. ముమ్మూర్తులు వహించి ముద్దుబిడ్డల మురిపెములు దీర్చుచున్న ఆ విద్యాసరస్వతిని జూచి యెల్లరు సంతోషమునే చెందుచుండిరి. ఆ విద్యాపీఠము నటులనేయుంచిన బాగుగనేయుండెడిది. కాని ఉన్నటులుండి కళాశాల లేనిచోట కార్యాలయ ముండరాదనువాద మొకటి బయలువెడలెను. (అప్పటికి బెజవాడలో కాలేజీలేదు) అది నెమ్మది నెమ్మదిగా బలపడి విశ్వవిద్యాలయ మంతయు నొకే కేంద్రమున నుండవలయును గాని మూడుచోటుల నుండరాదను వాదము లోనికి దిగెను. అది క్రమముగా చట్టసభకెక్కి మండలాభిమానులగు సభ్యుల విపరీత వివాదములకు గుఱియై తుదకు రామశరాహతిగా దూలిపడిన మారీచునివలె రివ్వన పోయి విశాఖపురీసాగరతీరమున పడెను. ఈవిధముగా నిండులిబ్బి విశాఖపురికి దక్కెను. ఈ పరిష్కారమునకు గినిసి పశ్చిమాంధ్రులు ఈ విద్యాపీఠముతో సంబంధము త్రెంపుకొనిపోయి మద్రాసు విశ్వవిద్యాలయముతో పొత్తు గలిపికొనిరి. ప్రప్రథమమున ఆంధ్రోద్యమము నారంభించినట్టియు, ఆంధ్ర విశ్వవిద్యాలయమునకై కృషిచేసినట్టియు మధ్యమండలములవారు పరాభవభిన్నులై తలవంచి యూరకొనిరి. ఇందు తమకు బలీయమగు నన్యాయము జరిగెనని పశ్చిమాంధ్రులిప్పటికిని జగడమాడుచున్నను నిజమున కిందు పూర్తి దెబ్బ తినినవారు మధ్యమండలములవారే. ఆంధ్రదేశ మధ్యస్థమగు విజయవాటికయందొక కళాశాలను స్థాపించుటతో పూర్తిగావలసిన యీసమస్య విశ్వవిద్యాలయమును శాశ్వతముగా నొకమూల కీడ్చుటతో పరిసమాప్తి నొందినపుడు మధ్యమండలములకు అసంతృప్తిగాక సంతృప్తి యెట్లుండును?

అయినదేమో అయినది. ఈ విశ్వవిద్యాలయవివాద నాటక మింతటితో ముగిసిన బాగుగానుండెడిది కాని ఆ యదృష్టము పట్టలేదు. విశ్వవిద్యాలయమును దేశమధ్యముననుంచక స్వార్థాపేక్షతో కావలయునని పట్టుబట్టి తూర్పుదీరమువారు విశాఖపట్నమును చేర్చినారను భ్రాంతితో పశ్చిమాంధ్రులు ఉత్తరసర్కారులవారిపై నాగ్రహము చెందిరి.

ఈ అవకాశము చూచుకొని ఉత్తరసర్కారులవారిపై ప్రత్యేక కోపములున్న ప్రముఖులు కొందఱు, తూర్పుతీరము వారిని నమ్మరాదనియు, స్వార్థపరులనియు, రేపు ఆంధ్రరాష్ట్రము వచ్చినను తమమేలే చూచుకొందురుగాని రాయలసీమ క్షేమ మారయురనియు, అసలు రాయలసీమ యనినవారికి

గిట్టదనియు, ఏవేవో అపోహలు రాయల సీమలో వ్యాపింపజేసిరి. అవి సత్యమెఱుగని ప్రజలు సులభముగా నమ్మిరి.

నిజమునకు రాయలసీమ సోదరులకు గల్గిన యీ తలంపులు సరియైనవి కావు. మదరాసు శాసన నిర్మాణసభ నాలుగైదు భిన్న ప్రాంతీయులతో గూడుకొనినదిగాని కేవల ఉత్తర సర్కారులవారిచే నిర్మితమైనది గాదు. అన్ని మండలముల ప్రతినిధుల తోబాటు వారును కొందఱందు గలరే గాని వారికి ప్రత్యేక బలసహాయము లేమియు లేవు. మొదటినుండియు చెన్న రాష్ట్రములో నెక్కువ అధికార ప్రాబల్యము గల తమిళులీ యుద్యమమునకు ప్రతికూలురను విషయము ఇప్పటికిని మనకు అనుభవపూర్వకముగా తెలియుచునే యున్నది. ఆ తమిళుల తంత్రాంగమైననేమి; ప్రభుత్వము వారి అయిష్టమైననేమి; మనవారి అవివేకమైననేమి, ఆంధ్రవిశ్వ విద్యాలయము ఏడెనిమిది జిల్లాలవారి కందుబాటులో లేకుండ చేయబడినది. ఈ అన్యాయమునకు రాయల సీమవారెంత కుందుచున్నారో, మధ్య జిల్లాలవారును నంత విచారించుచున్నారు. ఈ విశ్వవిద్యాలయము తప్ప యింతకు మిక్కిలి ఆంధ్రులకు లభించిన మహాభాగ్యములేదు. దానిని రాయలసీమను కాదని ఉత్తర సర్కారు లనుభవించినదియు లేదు. ఈ విశ్వవిద్యాలయమునకైనను మొదటినుండియు రాయలసీమవారే ఉపాధ్యక్షులుగా నున్నారుగాని తూర్పుతీరము వారెప్పుడు నుండలేదు. అయినను తూర్పు తీరాంధ్రులు వారియెడ గౌరవాదములు గలిగియుండిరేగాని యొకనాడును అయిష్టతను జూపలేదు, సత్యమిటులుండ ఉత్తర సర్కారులవారిని స్వార్థపరులక్రింద జమకట్టి రాష్ట్రవిషయమున కలిసిరాకుండుటయు, తమ పాఠశాలలను మదరాసు విశ్వవిద్యాలయముతో పొత్తుకలుపుటయు పశ్చిమాంధ్ర సోదరుల కనుచితమనుటకు సందియములేదు.

యావదాంధ్రులను నొకటిగా బంధించునది భాష. ఆ భాషసూత్రము బంధించి యుండినన్నాళ్లు యెవరుగాని ఆంధ్రుల వేఱు జేయజాలరు. ఆ భాష యీ పదిరెండు జిల్లాల ఆంధ్రులనేగాదు రాష్ట్రాంతర ఖండాంతరాంధ్రులనుగూడ నేక మొనర్చును. తెలుగువాడే దేశముననున్నను తన దేశము తన భాషయని చెప్పుకోదగిన ప్రత్యేక రాష్ట్రమొకటి తన కుండవలయునని వాంఛించుట వాని ధర్మము.

బరంపురమునుండి బళ్లారి వఱకు గల తెలుగుసీమ యంతయు నేక మాతృస్వరూపమేగాని భిన్నముగాదు. ఇందులో నే కొంచెము విడదీయనెంచినను ఆ మాతృదేవి అవయవముల విచ్ఛేదమొనర్చి వికృతమొనర్చుటయేగాని యన్యముగాదు. కల్పలతా! మాతృదేశాభిమానియగు నే తెలుగుప్రాణి యీ మాతృద్రోహమునకు సమకట్టును? రాయలసీమలేని ఉత్తర సర్కారులు, మొండెములేనితల; ఉత్తర

సర్కారులేని రాయలసీమ తలలేని మొండెము. ఆంధ్రమాత ఈ రూపములో దేనినైన తాల్చుటను ఆంధ్రులు సహింపగలరా?

సకాలమున పొలమునందు కలుపుతీయుట అశ్రద్ధచేయుటచే అనగత్యమగు మొక్కలదికముగా పెరిగి సస్యమునకు నష్టముగలిగించినట్లు ఆంధ్రులు స్వరాష్ట్ర సాధనాయత్నమును విరమించి కొన్ని వత్సరములుగ యావద్భారత జాతీయోద్యమ వ్యవహారమగ్నులై యుండుటచే ప్రత్యేక రాష్ట్ర సంపాదనోద్యమములో నెన్నియో అనగత్య సంకోచములు గలుగుటకు హేతువైనది. ఇంతటనైన మన తెలుగువారు మేలుకొని యీ వ్యవహారమున నెల్లరేకమై కృషిచేసి ప్రత్యేక రాష్ట్రము బడయరేని దేశమునకెంతయేని అపకారముచేసిన వారయ్యెదరు.

ఈ విషయ మిటీవలనే ఆంధ్రనాయకులు గుర్తించుటచే ఆంధ్రరాష్ట్రమును సంపాదించుటకు మరల తీవ్రయత్న మారంభించినారు. తోడనే మాకు ప్రత్యేకరాష్ట్రము వలదను ప్రతి వచనములు, కలిసిరామను బెదరింపులు, మా భాగమేదో మాకు వివరించినగాని మే మూరకొనమను ఖండితపు పల్కులు బయలువెడలినవి. అయితే హారిజనుల క్షేమ విచారణ వచ్చినప్పుడెల్ల అంబేద్కరు పలికెడు పల్కులు హిందూ మహమ్మదీయ సఖ్యత యనినప్పుడెల్ల జిన్నా కోరెడి షరతులు గమనించుచున్నవారికి రాయలసీమవారు పలికెడి ప్రతికూలపు పలుకులు ఆశ్చర్యమును గలిగింపజాలవు. దీపమున్నపుడే చక్కపెట్టుకొను మనురీతిగ ఆవలివారొక విషయమున మాతో కలిసిరండని నప్పుడేగదా ఎవరైనను తమ అవసరములు గట్టిపఱచుకొనుటకు చూచునది. కావుననే శ్రీ బాగుబడంబడికలాది వాగ్దత్తములు పశ్చిమాంధ్రులను సంతృప్తి పఱచుటకు జరుగుచున్నవి.

క్షాని కల్పలతా! ఆంధ్రరాష్ట్రము ఆంధ్రు లందఱిసొత్తు. అయ్యది సిద్ధించెనేని ఆంధ్రు లెల్లరకు ప్రయోజనము కలిగియే తీరును. ఆంధ్రరాష్ట్రము సిద్ధించుటవలన ఆంధ్రజాతి అభ్యుదయము చెందెనేని, ఆంధ్రభాష వర్ధిల్లెనేని, ఆంధ్రవాణిజ్యము విస్తరిల్లెనేని, ఆంధ్రపరిశ్రమలు పునరుద్ధరింపబడెనేని, ఆంధ్ర జలాధారములు బాగుచేయబడెనేని అయ్యది ఆంధ్రులందఱికి ప్రయోజనకరముగాక ఉత్తర సర్కారులకు మాత్రమే లాభకరమగునా? అందును ప్రబలతమమగు రాజకీయాందోళనవలన ప్రతివ్యక్తియు వ్యవహారజ్ఞానముగలిగి తమ తమ హక్కు బాధ్యతలను గుర్తెరిగి పీసమాత్ర వ్యత్యాసము వచ్చినను సహింపక పోరాడెడి యీకాలముననే యొకరి హక్కునుగాని మఱొకరు చూఱగొనుట సాధ్యమగునా? తుంగభద్ర, పెన్నమున్నగు నదీమతల్లులను గలిగియుండియు రాయలసీమ యెంతయో నసిచెడియున్నది. యేటేట నచట సంభవిల్లెడి క్షామములు ఆంధ్రుల నెంతైన కలవరపెట్టుచున్నవి.

ఈ దుర్భరదుర్భిక్షబాధలనుండి పశ్చిమాంధ్రులు విముక్తినందవలయునన్నచో తుంగభద్ర ప్రాజెక్టు మున్నగునవి యతిశీఘ్రమున నిర్మింపబడవలయును. ఇది సామాన్యముగ నగు పనికాదు. లక్షలకొలది ద్రవ్యము కావలయును. ఈ ద్రవ్యనిష్పత్తికి ఉత్తర సర్కారులె పూనుకొనవలయును. ఇంత కాలమునుండి తమిళదేశమున మెట్టూరు ప్రాజెక్టు వగైరాలకు వ్యయముచేయబడుచున్న ఉత్తరసర్కారుల భూమ్యాదాయము ప్రత్యేకాంధ్రరాష్ట్ర మేర్పడగనే రాయలసీమకు మరలించవలసియుండును. ఈసందర్భమున పశ్చిమాంధ్రులపై తూర్పుతీరమువారు చూపవలసిన ఔదార్యము స్వల్పము కాదు. ఇంత తెలిసియు దత్తమండలముల వారు తూర్పుతీరాంధ్రులను శిక్షించునిమిత్తము మాకు ప్రత్యేకరాష్ట్రము వలదని వాదించుచో అయ్యది రాయలసీమకును తక్కువశిక్ష కాజాలదు.

కాన ఆంధ్రులెల్లరు ప్రత్యేకరాష్ట్రము కొఱకై ఐకమత్యముతో కృషిసేయవలయును. ఈవిషయమున నిప్పటికే దేశమున గొప్ప ఆందోళన బయలువెడలినది. ఇటులనే తెలుగునాడంతయు నేకీభావముతో పనిసాగించునేని మన చిరకాలాభీష్టమగు ప్రత్యేకరాష్ట్రము సిద్ధించితీరును. ఈవిషయమై మన స్త్రీలుగూడ నీ మహాప్రయత్నమునకు తోడ్పడి తమ ధర్మము నిర్వర్తింపవలయును. అది యెట్లు? ఇప్పటికే లేఖ కడుదీర్ఘమైనది. ఆవిషయమును మఱొకమారు. సెలవు.

భావపురి
౧-౭-౩౭

ఇట్లు
మిత్రురాలు శారద.